మన్మోహన్ సింగ్ ఇకలేరు

- 92 ఏండ్ల వయసులో కన్నుమూసిన మాజీ ప్రధాని
- ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- రాష్ట్రపతి, ప్రధాని తదితర ప్రముఖుల సంతాపం
- వారం రోజులు సంతాప దినాలు ప్రకటించిన కేంద్రం
- ఐదు దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో దేశానికి సేవలు
- సంక్షోభం నుంచి గట్టెక్కించిన ఆర్థిక సంస్కరణల రూపశిల్పి

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: భారత మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్(92) కన్నుమూశారు. తీవ్ర అనారోగ్యంతో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం ఆయన తుదిశ్వాస విడిచారు. గత కొన్నాళ్లుగా వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి స్పృహ కోల్పోవడంతో కుటుంబసభ్యులు దవాఖానకు తరలించారు. దాదాపు గంటన్నర పాటు ఆయనకు చికిత్స అందించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, 9.51 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారని ఎయిమ్స్ ప్రకటించింది. మన్మోహన్ సింగ్ మృతికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్ని పార్టీల నేతలు సంతాపం వ్యక్తం చేశారు. ఏడు రోజుల పాటు సంతాప దినాలుగా కేంద్రం ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రిగా పనిచేసి దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి ఒడ్డుకు తెచ్చిన ఘనత మన్మోహన్‌దే. సరళతర ఆర్థిక విధానాల రూపకర్తగా, దేశ ఆర్థికవ్యవస్థకు కొత్తదిశను చూపిన మార్గదర్శిగా ఆయన నిలిచారు.

దేశం గర్వించదగ్గ ఆర్థికవేత్త

1932 సెప్టెంబర్ 26న ప్రస్తుత పాకిస్థాన్‌లోని గాహ్ ప్రాంతంలో జన్మించారు. 1947లో దేశ విభజన జరిగినప్పుడు మన్మోహన్ సింగ్ కుటుంబం భారత్‌కు వచ్చి మొదట హల్ద్వానీలో, ఆ తర్వాత అమృత్‌సర్‌లో స్థిరపడింది. మన్మోహన్ చిన్న వయసులోనే ఆయన తల్లి మృతి చెందడంతో నానమ్మ దగ్గర పెరిగారు. పంజాబ్ వర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో 1952లో డిగ్రీ, 1954లో పీజీ పూర్తి చేశారు. 1957లో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశారు. 1962లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ డాక్టరేట్ అందుకున్నారు. తర్వాత భారత్‌కు తిరిగొచ్చి తను చదివిన పంజాబ్ యూనివర్సిటీలోనే ఎకనమిక్స్ సీనియర్ లెక్చరర్‌గా, రీడర్‌గా, ప్రొఫెసర్‌గా పని చేశారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లోనూ ఆయన కొంతకాలం ప్రొఫెసర్‌గా పాఠాలు బోధించారు. ఇదే సమయంలో ఆయన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖకు సలహాదారుగా వ్యవహరించారు. 1972 నుంచి 1976 వరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రధాన ఆర్థిక సలహాదారుగా పని చేశారు. 1982 నుంచి 1985 వరకు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 1985 నుంచి 1987 వరకు ప్రణాళిక సంఘానికి డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరించారు. దేశం గర్వించదగ్గ ఆర్థికవేత్తగా ఆయన ఎదిగారు.

రాజకీయాల్లోకి తీసుకొచ్చిన పీవీ

విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా మన్మోహన్ తనదైన ముద్ర వేశారు. ఆర్థిక రంగంలో ఆయన అనుభవం, జ్ఞానంతో ఎన్నో గొప్ప అవకాశాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. 1991లో దేశం కఠినమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా ఎన్నికైన పీవీ నరసింహారావు.. మన్మోహన్ సింగ్‌కు అనూహ్యంగా తన క్యాబినెట్‌లో చోటు కల్పించి ఆర్థికమంత్రిని చేశారు. ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని గాడిన పెట్టే కీలక బాధ్యతను అప్పగించారు. ఈ సమయంలోనే దేశంలో ఆర్థిక సంస్కరణలకు, సరళతర విధానాలకు మన్మోహన్ సింగ్ శ్రీకారం చుట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపించారు. ఆర్థిక సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించడమే కాకుండా, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దేశాన్ని నిలిపారు.

పీవీతో..

ప్రధానిగా అనూహ్య అవకాశం

1991లో మొదటిసారి అస్సాం నుంచి రాజ్యసభకు ఎన్నికైన మన్మోహన్ సింగ్ 2019 వరకు కొనసాగారు. 2019లో రాజస్థాన్‌కు మారి మరోసారి రాజ్యసభలో అడుగుపెట్టారు. 1998 నుంచి 2004 వరకు వాజ్‌పేయీ ప్రభుత్వం ఉన్నప్పుడు రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మన్మోహన్ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 2004లో కాంగ్రెస్ నేతృత్వంలో యూపీఏ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు ప్రధాని పదవికి అనేక మంది పేర్లు వినిపించినా అనూహ్యంగా ఈ అవకాశం మన్మోహన్ సింగ్‌కు దక్కింది. 2004 మే 22న మొదటిసారి ఆయన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ఐదేండ్ల తన పాలనకు ప్రజామోదాన్ని పొంది 2009లో మరోసారి ప్రధాని అయ్యారు. పదేండ్ల పాటు ప్రధానిగా కొనసాగి, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, నరేంద్ర మోదీ తర్వాత ఎక్కువ కాలం దేశానికి ప్రధానిగా పని చేసిన నాలుగో వ్యక్తిగా రికార్డు సృష్టించారు.

మన్మోహన్ సేవలు చిరస్మరణీయం: రాష్ట్రపతి

'విద్య, పరిపాలనను సులభంగా నడిపించిన అరుదైన రాజకీయ నేతల్లో మాజీ ప్రధాని మన్మోహన్ ఒకరు. భారత ఆర్థిక వ్యవస్థ సంస్కరణలో ఆయన సేవలు కీలకమైనవి. దేశానికి ఆయన చేసిన సేవలు, నిష్కళంకమైన రాజకీయ జీవితం, ఆయన వినయం చిరస్మరణీయం. ఆయన మరణం మనందరికీ తీరని లోటు' అని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు.

ఆర్థిక వ్యవస్థపై బలమైన ముద్ర: ప్రధానమంత్రి

'విశిష్టమైన నాయకుల్లో ఒకరిని కోల్పోవడంతో భారత్ దుఃఖంలో మునిగిపోయింది. వినమ్రమైన మూలాల నుంచి ఆయన గౌరవనీయమైన ఆర్థికవేత్తగా ఎదిగారు. ప్రధానిగా, ఆర్థిక మంత్రి సహా అనేక ప్రభుత్వ హోదాల్లో పనిచేసి దేశ ఆర్థిక వ్యవస్థపై ఆయన బలమైన ముద్ర వేశారు' అని ప్రధాని మోదీ అన్నారు.

మౌనంగానే దేశంపై తనదైన ముద్ర

ప్రధానిగా పని చేసినప్పుడు ఆయనను మౌనమునిగా ప్రతిపక్షాలు విమర్శించేవి. అయితే, ఆయన మౌనంగా ఉంటూనే దేశాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. ప్రధానిగా మొదటి పర్యాయంలో ఆయన దేశ చరిత్రలోనే కీలకమైన ఎన్నో నిర్ణయాలను తీసుకున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి సమాచారాన్ని తెలుసుకునే హక్కు సామాన్యులకు ఉండాలనే లక్ష్యంతో సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారు. గ్రామీణ ప్రజలకు వ్యవసాయేతర ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో చారిత్రక ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రతి పౌరుడికి ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండాలని ఆధార్ వ్యవస్థను తీసుకొచ్చారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యం కోసం నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ చేపట్టారు. 2008లో వామపక్షాలు వ్యతిరేకించినా, ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నా అమెరికాలో పౌర అణు ఒప్పందాన్ని చేసుకున్నారు. మన్మోహన్ ప్రభుత్వంలో దేశంలో జరిగిన మార్పులను గుర్తించిన ప్రజలు 2009లో మరోసారి యూపీఏ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారు. 2009 మే 22న మన్మోహన్ సింగ్ రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.

భరతమాత ముద్దుబిడ్డ

మన్మోహన్ సింగ్ మృతిపై కేసీఆర్ దిగ్భ్రాంతి

ఆయన హయాంలోనే తెలంగాణ ఏర్పడిందని వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశం ఆర్థికంగా క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు మాజీ ప్రధాని పీవీ తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంలో ఆర్థిక రంగ నిపుణుడిగా తన విద్వత్తును ప్రదర్శించారని కొనియాడారు. పీవీ మనసు గెలిచిన మన్మోహన్ సింగ్ అనేక ఉన్నత శిఖరాలకు చేరుకున్న భరతమాత ముద్దు బిడ్డగా కొనియాడారు. మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగడం చారిత్రక సందర్భం అని అన్నారు. మితభాషిగా, సౌమ్యుడుగా, జ్ఞానాన్ని సొంతం చేసుకున్న స్థితప్రజ్ఞత కలిగిన నేతగా, ప్రధానిగా మన్మోహన్ దేశానికి అందించిన సేవలు గొప్పవని అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని, ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ఏర్పాటు సందర్భంగా అందించిన మద్దతును తెలంగాణ సమాజం సదా గుర్తుంచుకుంటుందన్నారు. మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటన్నారు. శోకతప్తులైన వారి కుటుంబీకులకు సానుభూతి తెలిపారు.

నిజమైన మేధావి: కేటీఆర్

మన్మోహన్ మృతిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. ఆధునిక భారత నిశ్శబ్ద వాస్తుశిల్పి అని, నిజమైన మేధావి, మానవతామూర్తని కొనియాడారు. దేశ చరిత్రలో ఎప్పుడూ గుర్తుండిపోతారన్నారు. ఆయన కుటుంబీకులకు సానుభూతి తెలిపారు.

మన్మోహన్ అంకితభావం స్ఫూర్తిదాయకం: హరీశ్‌రావు

మన్మోహన్ మృతి పట్ల మాజీ మంత్రి హరీశ్‌రావు విచారం వ్యక్తం చేశారు. దూరదృష్టి గల నాయకుడని, భారతదేశ ఆర్థిక సంస్కరణలకు రూపశిల్పి అని స్మరించుకున్నారు. ప్రజాసేవలో ఆయన అంకితభావం స్ఫూర్తిదాయకమన్నారు.

బీఆర్‌ఎస్ ప్రముఖుల సంతాపం

మన్మోహన్ మృతిపై జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితతో పాటు, బీఆర్‌ఎస్ మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, సంతోష్‌కుమార్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సంతాపం తెలిపారు. మన్మోహన్ మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కూడా సంతాపం తెలిపారు.

తెలంగాణ మనసెరిగిన మన్మోహనుడు

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): దశాబ్దాల పాటు తెలంగాణపై కొనసాగిన అణచివేత, ఆర్థిక దోపిడీ, సామాజిక, సాంస్కృతిక వివక్ష తెలిసిన అతికొద్ది మంది జాతీయ నాయకుల్లో మన్మోహన్‌సింగ్ ముందు వరుసలో ఉంటారు. తెలంగాణ ఆకాంక్షలను, రాష్ట్రం ఆవిర్భవించకపోతే జరిగే అనర్థాలను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ పూసగుచ్చినట్టు వివరిస్తే అర్థం చేసుకున్న మనసున్న పాలకుడాయన. 1971లో తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తామని మాటతప్పిన కాంగ్రెస్ తప్పును 2014లో సరిదిద్ది, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు బాటలు వేసిన ఘనత ఆయనకు దక్కుతుంది.

పీవీ, కేసీఆర్, జయశంకర్‌తో అనుబంధం

పీవీ నరసింహారావు, కేసీఆర్, ప్రొఫెసర్ జయశంకర్‌తో మన్మోహన్‌ది ప్రత్యేక అనుబంధం. మన్మోహన్ శక్తి సామర్థ్యాలను గుర్తించి ఆయనను రాజకీయాల్లోకి తెచ్చింది పీవీనే. కాకతీయ విశ్వవిద్యాలయం మన్మోహన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన సమయంలో వీసీగా ఉన్న ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌తోనూ ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉంది. 2004 ఎన్నికల ముందు తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా కేసీఆర్ సారథ్యంలో ఏర్పడిన ఆనాటి టీఆర్‌ఎస్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోక తప్పని అనివార్యత ఏర్పడింది. ఆ సమయంలో కేసీఆర్‌ను ఒప్పించేందుకు మన్మోహన్‌సింగ్ తెరవెనుక ప్రొఫెసర్ జయశంకర్ ద్వారా సమాలోచనలు చేశారు. కేసీఆర్‌ను 'చంద్రశేఖర్‌జీ' అని ఆయన ఆప్యాయంగా సంబోధించేవారు. తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ ఆమరణ దీక్ష చేసినప్పుడు చలించిపోయిన సున్నిత మనస్కుడు మన్మోహన్ సింగ్.

త్రిమూర్తుల కూర్పు.. డిసెంబర్ 9 ప్రకటన

తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తామని యూపీఏ ప్రభుత్వం డిసెంబర్ 9న చేసిన ప్రకటనను త్రిమూర్తుల కూర్పుగా చెప్తుంటారు. ప్రకటన చేసింది నాటి హోంమంత్రి చిదంబరమే అయినా... కేసీఆర్‌కు, మన్మోహన్ సింగ్‌కు మధ్య వారధిగా జయశంకర్ సార్ ఉన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు మద్దతు కూడగట్టడంలో కేసీఆర్‌కు మన్మోహన్ సింగ్ సూచనలు చేశారు.

'ఇండియా' నుంచి కాంగ్రెస్ అవుట్?

- హస్తం పార్టీని తప్పించేందుకు ఆప్ పావులు
- అఖిలేశ్, మమతకు కేజ్రీవాల్ ఫోన్?
- కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ మధ్య ముదిరిన పోరు
- ఇప్పటికే మమతకు జైకొట్టిన కూటమి నేతలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: ఇండియా కూటమిలో మళ్లీ మంటలు రాజుకున్నాయి. కాంగ్రెస్ పార్టీని కూటమి నుంచి బయటకు పంపేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ పావులు కదుపుతున్నది. కూటమి నాయకత్వాన్ని కాంగ్రెస్ వదులుకోవాలని ఇన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్న పార్టీలు ఇక కాంగ్రెస్‌నే వదిలించుకోవాలనే నిర్ణయానికి వస్తున్నాయి. ఈ మేరకు హస్తం పార్టీని బయటకు పంపించే ప్రయత్నాలను ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రారంభించారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్‌పై కూటమి పార్టీల్లో మొదలైన అసంతృప్తి ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందే తీవ్రమయ్యింది. ఢిల్లీ ఎన్నికల్లో విడిగా పోటీ చేయాలని ఇప్పటికే ఆప్, కాంగ్రెస్ నిర్ణయించాయి. దీంతో అరవింద్ కేజ్రీవాల్‌పై కాంగ్రెస్ విమర్శలు ఎక్కుపెట్టింది. ఆయన దేశ వ్యతిరేకి అని ఆ పార్టీ సీనియర్ నేత అజయ్ మాకెన్ తీవ్ర విమర్శ చేశారు. 2013లో మొదటిసారి ఆప్ ప్రభుత్వం ఏర్పడటానికి మద్దతు ఇవ్వడం వల్లే ఢిల్లీలో తమ పార్టీ బలహీనపడిందని వ్యాఖ్యానించారు. మరోవైపు ఉనికిలో లేని పథకాల కోసం లబ్ధిదారుల నమోదు ప్రక్రియను ఆప్ ప్రభుత్వం చేపట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. ఈ మేరకు ఆమ్ ఆద్మీ పార్టీ, అరవింద్ కేజ్రీవాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కాంగ్రెస్‌కు ఆమ్ ఆద్మీ అల్టిమేటం

కాంగ్రెస్ తీరుపై ఆమ్ ఆద్మీ పార్టీ మండిపడుతున్నది. గురువారం ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. అజయ్ మాకెన్‌పై కాంగ్రెస్ పార్టీ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 24 గంటల అల్టిమేటం ఇచ్చారు. 24 గంటల్లో మాకెన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు కాకపోతే ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్‌ను తప్పించాలని కూటమిలోని మిగతా పార్టీలను డిమాండ్ చేయనున్నట్టు చెప్పారు. ఢిల్లీ ఎన్నికల్లో తమ పార్టీకి నష్టం చేసి, బీజేపీని గెలిపించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాను బీజేపీనే సిద్ధం చేసిందని అన్నారు. ఢిల్లీ సీఎం ఆతిశీ సైతం కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల ఖర్చు కోసం కాంగ్రెస్ అభ్యర్థులకు బీజేపీ నిధులు అందిస్తున్నదని తమకు విశ్వసనీయ సమాచారం ఉందని ఆమె పేర్కొన్నారు. కేజ్రీవాల్ దేశ వ్యతిరేకి అయితే లోక్‌సభ ఎన్నికల్లో తమతో ఎందుకు పొత్తు పెట్టుకున్నారని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు.

కూటమిలో కాంగ్రెస్‌కు ఎర్త్

హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల నుంచి కాంగ్రెస్‌పై ఇండియా కూటమిలోని మిగతా పార్టీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ తీరు వల్లే ఈ రాష్ట్రాల్లో ప్రతికూల ఫలితాలు వచ్చాయని ఆరోపించాయి. ఈ నేపథ్యంలో ఇండియా కూటమి నాయకత్వాన్ని తీసుకునేందుకు మమతా బెనర్జీ ముందుకొచ్చారు. రాహుల్ గాంధీ నాయకత్వంపై నమ్మకం కోల్పోతున్న పార్టీలు ఆమె వైపు మళ్లాయి. మమత నాయకత్వానికి ఎస్పీ, ఆర్జేడీ, ఎన్సీపీ(ఎస్పీ) వంటి కీలక భాగస్వామ్యపక్షాలు మద్దతు తెలిపాయి. కాంగ్రెస్ మాత్రం నాయకత్వాన్ని వదులుకునేందుకు సిద్ధపడలేదు. ఇప్పుడు కూటమి నుంచి కాంగ్రెస్‌ను మొత్తానికే తప్పించేందుకు ఆప్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ మేరకు ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌కు కేజ్రీవాల్ ఫోన్ చేశారని ప్రచారం జరుగుతున్నది.

ఐఏఆర్ఐ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు

తొలిసారిగా తెలుగు వ్యక్తి నియామకం

న్యూఢిల్లీ: భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఏఆర్ఐ) డైరెక్టర్‌గా తెలుగువాడైన చెరుకుమల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఐఏఆర్ఐకు డైరెక్టర్‌గా ఒక తెలుగువ్యక్తి ఎంపిక కావడం ఇదే తొలిసారి. శ్రీనివాసరావు ప్రస్తుతం నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్నారు. 1965 అక్టోబర్ 4న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా అనిగండ్లపాడులో జన్మించిన శ్రీనివాసరావు అదే ఊరులోని జడ్పీ పాఠశాలలో చదువుకున్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చరల్ బీఎస్సీ, ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఇజ్రాయెల్ టెల్ అవీవ్ విశ్వవిద్యాలయంలో పోస్ట్ డాక్టోరల్ చేసిన ఆయన దేశంలోని పలు పరిశోధన సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేశారు.

భారత్‌పై వాటర్‌బాంబ్!

- **ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్ నిర్మించేందుకు చైనా సన్నాహాలు**

బీజింగ్: ప్రపంచంలోనే అతిపెద్ద హైడ్రోపవర్ డ్యామ్‌ను నిర్మించేందుకు చైనా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. టిబెట్ పీఠభూమి తూర్పు అంచున ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న ఈ ప్రాజెక్టు వల్ల దిగువనున్న భారత్, బంగ్లాదేశ్‌కు చెందిన లక్షలాది మంది ప్రజలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. యార్లంగ్ జాంగ్పో నది దిగువ ప్రాంతాన నిర్మించే ఈ డ్యామ్ ద్వారా ప్రతి ఏడాది 300 బిలియన్ కేడబ్ల్యూహెచ్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తుందని చైనాకు చెందిన పవర్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ అంచనా వేసింది. ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్దదైన సెంట్రల్ చైనాలోని త్రీ గోర్జెస్ ఆనకట్ట ప్రతిఏడాది ఉత్పత్తి చేసే 88.2 బిలియన్ కేడబ్ల్యూహెచ్ కన్నా ఇది మూడు రెట్లు. అయితే ఈ ప్రాజెక్టు కారణంగా ఎంతమంది నిర్వాసితులవుతారు, పర్యావరణ వ్యవస్థకు కలిగే నష్టానికి సంబంధించిన వివరాలను చైనా వెల్లడించ లేదు.

ఐఆర్‌సీటీసీ సేవలకు అంతరాయం

న్యూఢిల్లీ: భారతీయ రైల్వే తత్కాల్, ఈ-టికెటింగ్ సేవలు గురువారం తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, యాప్‌లు పనిచేయకపోవడంతో, క్రిస్మస్ సెలవుల్లో రైల్వే ప్రయాణాలకు సిద్ధమైన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. నిర్వహణపరమైన పనులు చేపట్టడంతో టికెట్ సేవలకు అంతరాయం ఏర్పడిందని సంస్థ వెల్లడించింది. కాసేపటి తర్వాత ఐఆర్‌సీటీసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

రైతు సమస్యలపై చర్చించేందుకు

సమయమివ్వండి

రాష్ట్రపతిని కోరిన ఎస్‌కేఎం

న్యూఢిల్లీ: డిమాండ్ల సాధనకు రైతుల ఆందోళన, రైతు నేత జగ్జీత్ సింగ్ డల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న క్రమంలో వారి సమస్యలపై చర్చించేందుకు తమకు సమయమివ్వాలంటూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం రైతులు ఆందోళన చేస్తున్నారని, డల్లేవాల్ ఆమరణ దీక్ష చేస్తున్నారని తెలిపింది. దేశవ్యాప్తంగా 500 జిల్లాలకు చెందిన రైతులు ఇప్పటికే రాష్ట్రపతికి విజ్ఞాపన పత్రాలు సమర్పించారని, రైతు సమస్యలపై చర్చించేందుకు సమయం కేటాయించాలని ఎస్‌కేఎం విజ్ఞప్తి చేసింది.

డీఎంకే గద్దె దిగే వరకూ పాదరక్షలు ధరించను

తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై శపథం

చెన్నై: తమిళనాడులో స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీని గద్దె దించే వరకు చెప్పులు వేసుకోకుండా వట్టి కాళ్లతో నడుస్తానని బీజేపీ అధ్యక్షుడు కే అన్నామలై శపథం చేశారు. కోయంబత్తూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎలాంటి డబ్బు పంచకుండా ఎన్నికల్లో విజయం సాధిస్తామని, డీఎంకే ఓడే వరకు తాను పాదరక్షలు ధరించనని అన్నారు. అన్ని చెడులు తొలగిపోవడానికి కోయంబత్తూరులోని తన నివాసంలో శుక్రవారం ఆరుసార్లు కొరడాతో కొట్టుకుంటానని, ఆరు మురుగన్ క్షేత్రాలకు వెళ్లడానికి 48 రోజుల దీక్ష చేస్తానన్నారు.

ఐఫోన్ యూజర్లపై బాదుడు?

- **క్యాబ్ ధరల నిర్ణయంలో కంపెనీల గోల్‌మాల్**
- **ఆండ్రాయిడ్ యూజర్ల కంటే ఎక్కువ ఛార్జీలు**
- **తరచూ వాడే వారి నుంచి కూడా ఎక్కువ వసూలు**

చెన్నై, డిసెంబర్ 26: ఆండ్రాయిడ్ ఫోన్ నుంచి క్యాబ్ బుక్ చేసిన వారితో పోలిస్తే ఐఫోన్ నుంచి బుక్ చేసిన వారికి ఎక్కువ ఛార్జీ పడుతుందా? ఐఫోన్ వినియోగదారులను ధనికులుగా చూస్తూ కంపెనీలు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నాయా? చాలాకాలంగా వినియోగదారుల్లో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలుమార్లు సోషల్ మీడియా వేదికగా కొందరు ఇది నిజమేనని నిరూపించి, క్యాబ్ సర్వీసుల కంపెనీల తీరును ఎండగట్టారు. తాజాగా టైమ్స్ ఆఫ్ ఇండియా పరిశీలనలోనూ ఈ విషయం వెల్లడయ్యింది. చెన్నైలోని మూడు రూట్లలో ఈ సంస్థ ప్రతినిధులు ఆండ్రాయిడ్, ఐఫోన్‌ల నుంచి ఒకే సమయంలో క్యాబ్‌లు బుక్ చేశారు. మూడు రూట్లలోనూ ఆండ్రాయిడ్ నుంచి బుక్ చేసిన వారి కంటే ఐఫోన్ నుంచి బుక్ చేసిన వారికి ఎక్కువ ఛార్జీ పడింది. మదిపక్కం నుంచి వెలచెరి ఫియోనిక్స్ మాల్‌కు ఆండ్రాయిడ్ నుంచి క్యాబ్ బుక్ చేస్తే *రూ.195 పడగా, ఐఫోన్ నుంచి బుక్ చేసిన వ్యక్తికి రూ.260 పడింది. టీనగర్ నుంచి ఎగ్మోర్‌కు ఆండ్రాయిడ్ యూజర్‌కు రూ.180 పడగా, ఐఫోన్ యూజర్‌కు రూ.344 పడింది. అవది నుంచి చెన్నై ఎయిర్‌పోర్టుకు ఆండ్రాయిడ్‌లో రూ.961 పడగా, ఐఫోన్‌లో రూ.1,010 పడింది.*

రెగ్యులర్ యూజర్లపైనా ప్రతాపమే

క్యాబ్ సర్వీసుల కంపెనీలు వినియోగించే ప్రైసింగ్ అల్గారిథంలు ఇలా భిన్నమైన ధరలు చూపిస్తాయని నిపుణులు చెప్తున్నారు. ఏ ఫోన్ వాడుతున్నారనేది తెలుసుకోవడం, దానికి తగ్గట్టుగా ధరను మార్చడం చాలా చిన్న విషయమని ఫాస్ట్‌ట్రాక్ అనే సంస్థ ఎండీ సీ అంబిగణపతి తెలిపారు. ఏ డివైజ్ నుంచి బుక్ చేశారు, సదరు వినియోగదారు యాప్‌ను ఎన్నిసార్లు వాడుతున్నాడు వంటి విషయాలను క్యాబ్ అగ్రిగేటర్లు గుర్తిస్తాయని మరో నిపుణుడు పీ రవికుమార్ తెలిపారు. ఇందుకోసం ఆయా సంస్థలు గూగుల్ క్లౌడ్ ఏఐ, అజ్యూర్ ఎంఎల్ వంటి మెషీన్ లెర్నింగ్ సాంకేతికతలను వినియోగిస్తాయని చెప్పారు. ఫోన్‌ను బట్టి, వినియోగదారు ప్రవర్తనా తీరును బట్టి కూడా ధరలు మారుతాయని పలువురు నిపుణులు చెప్తున్నారు.

ఉబర్, ఓలా యాప్‌లపై దర్యాప్తు

ఉబర్, ఓలా వంటి యాప్‌లు ఒకే దూరానికి ఆండ్రాయిడ్‌లో ఒక ఛార్జీని, ఆపిల్ ప్లాట్‌ఫామ్‌లో వేరొక ఛార్జీని వసూలు చేస్తుండటంపై దర్యాప్తునకు కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ సీసీపీఏ దీనిపై దర్యాప్తు చేస్తుంది.

కాంగ్రెస్ బ్యానర్లపై దుమారం

- **భారత మ్యాప్‌ను వక్రీకరించేలా బ్యానర్లు**
- **దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నమని బీజేపీ ఫైర్**
- **బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

బెంగళూరు: మహాత్మాగాంధీ అధ్యక్షతన జరిగిన బెల్గాం సెషన్ వందో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బెళగావిలో కాంగ్రెస్ నిర్వహిస్తున్న సీడబ్ల్యూసీ సమావేశం తీవ్ర దుమారానికి కారణమైంది. సమావేశం సందర్భంగా కాంగ్రెస్ ఏర్పాటు చేసిన భారత పటం బ్యానర్లలో జమ్మూకశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలు కనిపించకుండా పోయాయి. ఈ ఫొటోల బ్యానర్లను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసిన బీజేపీ.. కాంగ్రెస్‌పై దుమ్మెత్తిపోసింది. ఈ ఘటనను 'సిగ్గుచేటు'గా అభివర్ణించింది. దేశాన్ని అస్థిరపరిచేందుకు యూఎస్ బిలియనీర్ ఇన్వెస్టర్ జార్జ్ సోరోస్‌తో కాంగ్రెస్ చేతులు కలిపిందని ఆరోపించింది. కాంగ్రెస్ తన బెళగావి సమావేశంలో వక్రీకరించిన భారత మ్యాప్‌ను ప్రదర్శించడం ద్వారా భారత సార్వభౌమత్వాన్ని పూర్తిగా అగౌరవపరిచిందని, కశ్మీర్‌ను పాకిస్థాన్‌లో భాగంగా చిత్రీకరిస్తున్నదని ఆరోపించింది. ఓటుబ్యాంకును ప్రసన్నం చేసుకునేందుకు ఇలా చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తింది. గాంధేయ భారతదేశం పేరుతో కాంగ్రెస్ వాదులు భారత మ్యాప్‌ను వక్రీకరించడం దేశద్రోహమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

సీఎం పదవిని తిరస్కరించా

బాలీవుడ్ నటుడు సోనూసూద్

ముంబై: ప్రజలకు సహాయ పడటమే తన ప్రధాన ధ్యేయమని, అందుకే ముఖ్యమంత్రి పదవిని చేపట్టాలంటూ ఇటీవల వచ్చిన ఒక ఆఫర్‌ను తాను తిరస్కరించినట్టు బాలీవుడ్ నటుడు సోనూసూద్ వెల్లడించారు. రాజకీయాల్లో లేకుండానే ప్రజాసేవ చేస్తున్నట్టు ఆయన చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని తిరస్కరించిన తర్వాత ఉప ముఖ్యమంత్రి పదవిని చేపట్టాలంటూ ఆఫర్ వచ్చిందన్నారు. కొందరు శక్తిమంతమైన నాయకులు రాజ్యసభ సీటును కూడా ఇస్తామన్నారని, స్వతంత్రతను కోల్పోవడం ఇష్టం లేక తిరస్కరించినట్టు చెప్పారు. 'ఎవరెన్ని ప్రతిపాదనలు తెచ్చినా నటనా రంగంపైనే నాకు మక్కువ. సినిమాలను ప్రేమిస్తా' అని సోనూసూద్ స్పష్టం చేశారు.